


'సార్... భూమికోసం మాయమ్మ యిచ్చిన అర్జీ.' అన్న మాటకు తలెత్తి నావైపు చూసాడు హెడ్‌క్లర్క్. నా ముఖంలో జలగని చూసిన ఫీలింగ్‌తో తలదించుకుని బెంచీని చూపిస్తూ... 'అక్కడ కూర్చోండి... పిలుస్తాను' అంటూనే పనిచేసుకుపోతున్నాడు. పనిచేసుకుపోతున్నాడనే దానికంటే వ్యాపారం చేస్తున్నాడనిపించింది. అతని టేబులు చుట్టూ నిమ్నజాతి వాళ్లు... వృద్ధాప్య ఫించను కోసం, పట్టా పాసు పుస్తకాల కోసం, మిగిలిన బంజరు భూముల సొంతం కోసం, రేషన్ కార్డుల కోసం అర్జీలతో నిలబడ్డారు.

ఆ హాల్లోనే ఒకవైపు టైపిస్టు, యింకోవైపు యు.డి.సి. టేబుల్స్ వున్నాయి. ఆ హాలుకు నా అభిముఖంగా వున్న తలుపుకి కర్టెన్ వేసి, ఆ తలుపుపైన ఎం.ఆర్.ఓ. అన్న నేమ్ బోర్డు తగిలించారు. హెడ్ క్లర్క్‌కు వెనుకగా రికార్డు రూం వుంది. అందరూ బిజీగానే పేపర్ల మీద పేపర్లు దిద్దుతూ... పనికోసం వచ్చిన తలకాయలపై రుద్దుతున్నారు.

అసౌకర్యంగానే... మూలగా గోడకాన్చిన బెంచీమీద కూర్చున్నాను. ఆ బెంచీ నా కుదుపుకు అటు యిటు ఊగింది. ఆ ఊపును నా శరీరంతో బ్యాలెన్స్ చేసి స్థిరంగా కూర్చుని ఆ హెడ్ క్లర్క్‌కు కన్పించేలా అతని దయాదాక్షిణ్యాల కోసం చూస్తున్నాను. కనీసం అతను కనికరించిన క్షణం నా చూపు మరలకూడదన్న గట్టి నిర్ణయం ఆ చూపులో వుంది.

హెడ్ క్లర్క్ ఓ రైతు వైపు చూస్తూ ఎడమ చేతిలో పేపర్లు నొక్కిపెడుతూ... కుడి చేతి వేళ్ళతో ఏవో సైగలు చేస్తున్నాడు. బహుశా ఆ వేళ్ళు లెక్కించడం వాళ్ళు తీసుకొనే కట్నానికి పర్యాయమై వుంటుంది కాబోలు అక్కడ గడుస్తున్న ప్రతి సెకను సాకు నిప్పుల గుండంపై నడుస్తున్నట్టుంది.

'ఎన్నిసార్లు చెప్పాలి. పట్టా పాసు పుస్తకం కోసం నాలుగు ఫోటోలు కావాలని... వెళ్ళి ఆ శ్రీరాం ఫోటో స్టూడియోలో ఫోటో తీయించుకురా పో... ఫోటో లేకపోతే పని అవ్వదు...' గద్దింపుగా ఓ రైతుకు హెడ్ క్లర్క్ చెవుతున్నాడు.

'ఫోటో తీయించుకుంటే... ఎంటనే యిరుకద్సార్...' అన్న రైతు మాటకు మధ్యలో అడ్డుతగిలి...

'ఏమయ్యా... నువ్వెళ్ళి ఫోటో తీయించుకో... వాడే ఫోటోలు కడిగి మాకు పంపిత్తాడు. వెళ్లు...' తుంచివట్టే హెడ్ క్లర్క్ చెప్పాడు. ఏదో అనుమానమున్నా... అయ్యగారికీ అపాత్రుడవ్వటమెందుకని అర్థం కాకున్నా అర్థమైనట్టు తలూపి ఆ రైతు బయటకెళ్ళటానికి ఉపక్రమించాడు.

ఫోటో అన్నమాటకు నా రెండేళ్ళ వయసులో మా అమ్మ తీయించిన ఫోటో గుర్తుకొచ్చింది. నా పుట్టెంట్రుకలు తియ్యడానికి కొద్ది రోజుల ముందు... మా పల్లెకు గోరంట్ల మంచి ఎవరో పెద్ద ఫీల్డ్ కెమెరా తీసుకొస్తే... నాకు నూనె పెట్టి, నున్నగా దువ్వి రెండు జడల్ని భుజాలమీదకేస్తూ... నుదుటిన తిలకం దిద్ది పక్కింటి పాలెమ్మ చినకూతురి గౌను తీసుకొచ్చి నాకు తొడిగి, ఊళ్లో వాళ్ళ దిష్టి తగలకుండా సాదు చిప్పలో రంగరించి చెంపన నల్లటి చుక్కపెట్టి ఫోటో తీయించింది. ఆ ఫోటోకు గోరంట్ల సంతలో ఫ్రేం కట్టించి గుడిసెలోని గోడకు తగిలించి ఎంతో మురిసిపోయింది. ఆ ఫోటో గోడకెక్కడానికి అయిన ఖర్చు కోసం మాయమ్మ అయిదు రోజులు రెడ్డోరి చేన్లోకి కలుపు తియ్యడానికెళ్ళానని ఎంతో ఆనందంగా నా చిన్నప్పుడు చెబుతుంటే పళ్ళు యికిలిస్తా నవ్వేవాడ్ని. బాధల్లోంచే ఆప్యాయతలు పుట్టుకొస్తాయని అప్పట్లో తెలిసేది కాదు. చిన్నప్పటి ఆ ఫోటోను... నాకుద్యోగం వచ్చాకా, గొప్పగా చెప్పుకోడానికి, యితరులకు చూపించుకోడానికి నాతోపాటు ఆ ఫోటో కూడా స్థానభ్రంశమైంది. ఆ ఫోటో గుడిసె దాటి నా బెడ్‌రూంలోకి అలంకార ప్రాయంగా చేరింది. అమ్మకవురూపమైన దాన్ని బలవంతంగా లాక్కుపోయావని... అమ్మ అమరాగపు పుస్తకంలోని ఓ పేజీని చించుకెళ్ళావని అప్పుడనిపించలేదు.

'అర్థం కాలేదా...?' అన్న అరుపుకు ఈ లోకంలోకొచ్చి హెడ్ క్లర్క్ టేబుల్ వైపు చూశాను. ఓ సన్నకారు రైతుతో హెడ్ క్లర్క్ అరుస్తున్నాడు.

'చెప్పుకోవయ్యా... ఎం.ఆర్.ఓ.తో కాకపోతే కలెక్టర్‌తో చెప్పుకో... భయపెడితే భయపడతాననుకున్నావా. ఏదో పాపం కదాని... దయతలుస్తూంటే నెత్తినెక్కి కూర్చుంటావా?'

'అదికాదు సార్... మావోడు తెలీక ఏదో వాగితే మీరు దాన్ని పట్టుకుని...' ఆ రైతు పక్కనున్న ఆసామీ సర్దటానికి ప్రయత్నిస్తున్నాడు.

'అలా చెప్పు వాడికి... యిక్కడ నోరు పారేసుకుంటే, వెతుక్కోడానికి వాడి అర్జీ కూడా దొరకదని చెప్పు..' హెచ్చరిస్తూనే సర్దుకున్నాడు హెడ్ క్లర్క్.

ఆ సన్నకారు రైతు వెంటొచ్చిన ఆసామీ గదమాయిస్తూ ఆ రైతుని బయటకు తీసుకెళ్ళాడు.

హెడ్ క్లర్క్ టేబులు చుట్టు యింకా యిద్దరు మిగిలే వున్నారు. వాళ్ళ విషయం కదపడానికి... సింహగర్జన విన్న లేడ్లలాగా బెదురు చూపులు చూస్తున్నాను.

నే వెళ్ళి నా పని గురించి అడిగితే?... అనుకున్నానే గానీ అంత ధైర్యం నాకుందా?

పది రోజుల నుంచి క్షురకర్మ చేసుకోక పాలేరులా వున్నాను. కొద్ది రోజులుగా నిద్రలేమిటో కళ్ళు ఎర్రబడ్డాయి. అందులోనూ మొన్న రాత్రి హైదరాబాదు నుంచి బస్సులో గోరంట్లకు వచ్చి అక్కట్నుంచి కాలినడకన కొత్తపల్లికి చేరుకుని పెద్దదినానికి కావల్సిన పనులు ఒక్కడ్నే ఒంటెద్దులా చేసుకుపోవటం వల్ల బట్టలు మట్టికొట్టుకుపోయాయి. వచ్చినరోజు సాయంత్రమే గోరంట్ల మండలాఫీసుకొచ్చి ఎంఆర్ఓతో నేను వచ్చిన పని చెబితే... యిదిగో ఈ హెడ్‌క్లర్క్‌కు నా పని అప్పగించి క్యాంపుకెళ్ళాడు. ఈ రోజు ఉదయమే రమ్మంటే తొందరగా పని అవుతుందనుకున్నాను గానీ, నా భౌతిక స్వరూపాన్నీ చూసిన ఈ క్లర్క్ యిలా ఎండక బెడతాడనుకోలేదు.

గంజిపెట్టిన ఖాదీ వస్త్రాలతో దాదాపు నలభై ఏండ్లున్న వ్యక్తి ఆ హాలులోకి ప్రవేశించాడు. అతన్ని చూసి అక్కడున్న రైతులు, అర్జీలు పట్టుకుని పనిమీదొచ్చినోళ్లు... వివిధ భంగిమల్లో నమస్కారాలు పెట్టారు. నేను మాత్రం ఆ బెంచిని అంటిపెట్టుకుని చూస్తున్నాను.

అతను నేరుగా హెడ్‌క్లర్క్ టేబుల్ దగ్గరికెళ్ళి, ఆహ్వానించకుండానే ఎదురుగా వున్న కుర్చీని లాక్కుని బట్టలు నలక్కుండా కూర్చున్నాడు. హెడ్ క్లర్క్ ముందుగా నమస్కారం పెడితే అతను ప్రతిగా ఓ చిరునవ్వునవ్వాడు. ప్రతి నమస్కారం చేయాలన్న యింగితం కంటే అక్కడున్న జనాల్లో అతని దర్పం పెంచుకునేలా ప్రవర్తించాడనిపించింది.

దర్పం అంటే గుర్తొచ్చింది. మా పల్లెలో రెడ్డారిగేర్లో దీపాల పండుగనాడు ఎవరికి వారు చాలా గొప్పగా పల్లె అదిరిపోయేలా పటాసులు కాల్చటం అలవాటు. కాదు ఆనవాయితీ. మా గేర్లోని పిల్లలందరూ జారిపోతున్ననల్ల డాల్ని (నిక్కర్లని) పిర్రలమీదకు ఎగదోసుకుంటూ ఆ పటాసుల శబ్దాలవైపు చెవుల్ని రిక్కరిస్తా పరిగెత్తుకుంటూ వెళ్ళేవాళ్లం.

ఆరెడ్డోరి పిల్లలు తమ గుమ్మాల మీదున్న దీపాలతో పటాసులు అంటించి వీధుల్లోకి విసురుతుంటే ఆబగా చూసేవాళ్ళం. ఆడోళ్లు... కాకర పువ్వొత్తులూ, చిచ్చుబుడ్లూ, కాలుస్తూంటే... ఆ కాంతుల్లో మేమేకాలుస్తున్నామంత ఆనందంతో కేరింతలు కొట్టేవాళ్ళం.

అంటించి పారేసిన పటాసుల్లో ఢామ్మని పేలనివి, వత్తువరకు వెలిగి శబ్దం రాకుండా తుస్సుమన్న వాటిని, సగంకాలి ఆరిపోయి విసిరేసిన కాకరపువ్వొత్తుల్ని ఆత్రంగా ఒకరిమీద ఒకరు పడి ఏరుకునేవాళ్ళం. మళ్లా యింటి దగ్గర నింపాదిగా కాల్చొచ్చని.

ఆ శబ్దాలకు, ఆ విచిత్రాలకు ఆకలేయక అలాగే వాళ్ళ యిండ్లవైపు, ముచ్చట్లతో పటాసులు కాలుస్తున్న ఆరెడ్డోరి పిల్లలవైపు అలాగే ఆశగా చూస్తుంటే మాయమ్మ ఎన్ని వీధులు నాకోసం వెతికిందో ఆయాసపడుతూ... రేయ్ యీడుండవురా. యింటికి పద. సంగటి తిందువుగానీ అంటూ బ్రతిమలాడితే నేను రాను. వస్తే యింట్లో పటాసులుండవుగా అని గోముగా మఠాయిం చేస్తే బుజ్జగిస్తూ యింటికి తీసుకెళ్ళి దొంతుల్లోని తిండి గింజల్ని శెట్టి అంగడికివేసి మారుగా పటాసులు కొని నాకిచ్చేది.

ఆనందంతో యింటికొచ్చి మా గుడిసె ముందు కాలుస్తూంటే ఎంతో మురిపెంతో మాయమ్మ నావైపే చూసేది. మా పిల్లోడు కూడా పండగ పూట పటాసులు కాలుస్తున్నాడన్న ఆనందంతో సంబరపడి పోయేది. నీకేం కావాలో నన్ను అడగొచ్చు కదరా. అలా రెడ్డోరి యిండ్ల కాడికి ఎందుకు సెప్పు ఎళ్ళేది మందలింపుగా అంటూనేభుజాల మీదకు ఎక్కించుకొనేది.

టైపుమిషను శబ్దంతో హెడ్‌క్లర్క్ టేబుల్‌వైపు చూసాను. అక్కడ కాదీ బట్టల ఆసామీకి పనయిపోయిందనుకుంటా అక్కడలేదు. హెడ్‌క్లర్క్ బయటకెళ్ళడాని కన్నట్టు పేపర్లు, ఫైల్స్ మూస్తున్నాడు. లేచి ఒక్క అంగలో హెడ్‌క్లర్క్ టేబుల్ సమీపానికి చేరుకున్నాను. నన్ను చూసిన క్లర్క్ నాపని మరచిపోయినట్టు నటిస్తూ... ఎక్కడెక్కట్నుంచో వచ్చి మీదపడి పనిచేయించుకుంటారు ఈ అలగాజనం. వాళ్ల పనులు చేయలేదనుకో పిటీషన్లు పెడతారు. నాకుండేది రెండు చేతులే కదా? సమర్థించుకుంటూ నా జవాబు కోసం వెయిట్ చేయకుండానే భోజనం చేసిరండి. నేనూ భోజనం చేసివస్తాను. వస్తూనే మీ పని చేసిపెడతాను. టేబుల్‌దాటి ఒక్కడుగు ముందుకేసి నా వైపు చూసాడు నేనేం చెవుతానా అని నాకాకలిగా లేదు అని చెప్పాలనిపించినా అది లంచ్ టైం కాబట్టి నేనెంత బ్రతిమలాడినా నా పని చేయడన్న నిర్ణయంతో అలాగేనన్నాను. ఆ మాట నా గొంతు

లోతుల్లోంచి రాకపోయినా హెడ్‌క్లర్క్ ఆ మాటకు బయటపడ్డాడు.

యింతకీ ఈ హెడ్‌క్లర్క్ నా పని చేసి పెడతాడా? అన్న ఆతృత వున్నా అక్కడనేను చేసేపనిలేక మండలాఫీసు నుంచి బయటపడి రోడ్డుపై నడుస్తున్నాను.

ఆవూరుకది మెయిన్ తారురోడ్డు. తారు కన్పించకుండా మట్టితో కప్పెట్టిన సమాధిలా వుంది. ఆ రోడ్డుకు యిరుప్రక్కల రకరకాల అంగళ్ళు. అంగళ్ళకు వ్యాపారాలులేక వ్యాపారస్తులు బతాఖానీ కొట్టుకుంటున్నారు. స్వాతికార్తె వానలకు కలకల్లాడుతూ బురద నిండాల్సిన ఈరోడ్డు వానలేక, వానరాక ఉసురోమంటోంది. ఆ దుమ్ముల్లోంచే అక్కడక్కడ కాళ్ళీడ్చు కుంటూ గ్రామస్తులు, అంగలారుస్తా రైతులు ఎవరిపనివాళ్ళు నిస్సత్తువగా చేసుకుపోతున్నారు. అదే ఒక పదును వానపడితే ఆవ్యాపారస్థులే వాళ్ళ ముఖాల్లో రంగు పులుముకుని ఆ రైతుల్ని ఆహ్వానిస్తూ అప్పులిస్తారు. ఆదరిస్తా అందలమెక్కిస్తా వడ్డీలకు చక్రవడ్డీలు వేస్తారు. ఆ వానలే చుట్ట చుట్టుకుపోతే ఈ వ్యాపారులే అప్పకొచ్చిన రైతుల్తో ఏం వ్యాపారాల్లే మావా మా సేడ్లు సరుకుతోలడమే మానేసారు. మాగోడు ఎవరికి చెప్పకోవాలి అంటూ సంగెడువులు ఏడుస్తా రాగాలు తీస్తారు.

యింతలో ఓ చుట్రగాలి దుమ్ముతోపాటు చిత్తుకాగితాల్నీ, ఎండిన ఆకుల్నీ, కస్సకసమాలాన్నీ, తనతో కలుపుకుని నన్ను దాటి వెళ్ళింది. ఆ గాలికి అడ్డంగా గూటంలా నిలబడ్డానేమో నా నెత్తిన దుమ్మును గుమ్మరించింది. బట్టలకంటుకున్న దుమ్మును దులుపుకున్నానుగానీ... కండ్లల్లో, ముక్కుల్లో, చెవుల్లో నిలిచిన దుమ్ము రేణువుల్ని దులుపుకోలేకపోయాను (తుడుచుకోలేకపోయాను) కండ్లను నలుపుకుంటూ కుడిచేతివైపు చూసాను. మట్టికొట్టుకుపోయిన శ్రీ సత్యనారాయణ భవన్ అన్న బోర్డు కన్పిస్తే అప్రయత్నంగా అడుగులు అటువెళ్ళాయి. ఆ హోటల్‌లో ముందుగా వాష్‌బేసిన్ ఎక్కడుందో వెతికాను. కన్పించలేదు. 'యేం సార్... చేతులు కడుక్కుంటారా?' అన్న సమాధానంతో వంటరూం వైపు చూసాను. ఉడిపి అయ్యంగార్ నావైపు వస్తూ నీళ్ళున్న మగ్గును నాకందించాడు. మారు మాట్లాడకుండా ఆ మగ్గుతో బయటికొచ్చి ఆ రోడ్డుపైనే ముందుగా ముఖం, ఆ తర్వాత చేతులు కడుక్కుని... కాళ్లు కడుక్కోడానికినీళ్ళు అయిపోతే అలాగే వచ్చి మగ్గును టేబుల్‌మీదపెట్టి ఒక కుర్చీ లాక్కుని కూర్చున్నాను.

చేతికున్న తడి, ముఖానికున్న తేమ కూర్చున్నంత సేపులోనే ఆరిపోయాయి. ఈ స్వామికార్తెలో యింత ఎండుందా? అని అనిపించింది.

నేను కూర్చున్న టేబుల్‌కు ఎడమవైపు టేబుల్ దగ్గర ఒక మధ్యవయస్కుడు రైతుకూలీలా వున్నాడు. ఆవురావురు మంటూ భోజనం తింటున్నాడు. తింటున్న వాడి వాలకంలో అప్పడే అయ్యిపోతోందా? అన్నంత వేగం వుంది.

అయ్యంగార్ చేతివేళ్ళతో ముంచిన నీళ్లున్న గ్లాసును నా ముందు పెట్టి ఏం కావాలని అడిగేలోపే నేనే భోజనం కావాలని అప్రయత్నంగా అనేసాను. అయ్యంగార్ హడావుడిగానే భోజనం తీసుకురావడానికి వంటరూంలోకె ళ్ళాడు.

నేను అటువైపు టేబుల్‌ను చూసాను. వాడు తినటం పూర్తిచేసినట్టుగా ఆ భోజనం ప్లేటులోనే చేతిని కడుక్కున్నాడు. భుజం మీదున్న టవలుతో మూతిని తుడుచుకుంటూనే చేతిని తుడుచుకున్నాడు. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టుగా.

నా టేబుల్‌పై భోజనం ప్లేటు వుంచిన అయ్యంగార్... గిన్నెల్లోని గరిటెతో 'పప్పా? సాంబారా?' అంటూ అడిగాడు. సాంబారన్నాను.నీళ్ళలా వున్న ఆబకచారును ఆ మెతుకులపై పోసి వెళ్ళిపోయాడు. ప్లేటులో పోసిన సాంబారుకు అన్నపు మెతుకులు ఒకవైపుమాత్రమే తడిసాయి. ఆకలిగా లేదు. కడుక్కోడానికి నీళ్ళు యిచ్చాడన్న కృతజ్ఞతతో ఆర్డరిచ్చానే తప్ప తినడానికి కాదు. అన్నాన్నీ అసహనంగానే మునివేళ్ళతో కలుపుతున్నాను.

అనంతపురంలో యింటర్ చదువు వెలగబెడుతున్న నేను సెలవు దినాల్లో కొత్తపల్లికి వస్తే చిన్నప్పుడు ఆడుకున్న వీధులు, మార్పులేని వాకిళ్లు, గుడిసెలు, ఎండిపోయిన బావులు, చినుకుబొట్టు కోసం కుంకుమ బొట్టు. చెమటతో తడిసెలా ఆకాశంవైపు చూసే తలకాయలు, సుదూరాన్నుంచి దాహార్తితో కడవలు నెత్తినేసుకొస్తున్న అతివలు, గడ్డి కోసం కొండలవెంట పరుగులు పెట్టే పశువులు కన్పించేవి. వీటిలో యేసంవత్సరం యేమార్పు వుండేదికాదు. యివన్నీ చూస్తూంటే నాకు నవ్వొచ్చేది. కొత్తపల్లి అన్నపేరును భవిష్యత్‌లో ఎవ్వడైనా సార్థకత చేసుకుంటుందా ఈ పాతపల్లె? అనుకునేవాడిని. ఆ దాఖలాలు నాకెప్పడు కన్పించేవి కాదు.

కాని...మార్పులేని మా గుడిసెలో మాత్రం మాంగల్యం కోల్పోయిన మాయమ్మ కన్పిస్తే బాధకలిగేది. కూలీపని చేసుకుని బతికే మా కుటుంబంలో మానాయన, మాయమ్మ కష్టపడి పనుల్లేకిపోయి యింతకూలీ సంపాదిస్తే దాన్ని మాయమ్మ ఒబ్బిడిగా ఖర్చుపెట్టి నన్ను చదివించేది. ఖర్చులకు డబ్బులు పంపేది. 'బాగా కష్టపడి చదివి మంచి వుద్యోగం తెచ్చుకోవాలిరా నాయనా...నువ్వు మాలా కష్టపడి కూలీపని చేయకూడదురా చంద్రశేఖరా' అంటూ గుర్తుచేసేది మాయమ్మ. మా నాయనకు మాయదారి రోగమొచ్చి కడతేరినాక...నాపై చదువుకు మాయమ్మ అలుపెరుగని గానుగలా ఏమేం పనులు చేసింది. ఎంత కష్టపడింది ఊర్లోవాళ్ళు చెప్పకుపోతుంటే విరాటపర్వం విన్నంత బాధగా వుండేది.

ఈ పల్లెకొచ్చి అమ్మ అష్టకష్టాల్నీ చూసి నేను ఎక్కడ బాధపడతానోనని పల్లెకొచ్చిన మరునాడే అనంతపురం బయల్దేరమనేది మాయమ్మ. కష్టపడి చదివి పైస్థాయికి వెళ్ళాలన్న ఆశయాన్ని, నాలో నూరిపోసి...నా గురించి నువ్వేం బాధపడొద్దని మరిమరి అడిగి ఒట్టు వేయించుకునేది. ఉన్న ఒక్కరోజు మాత్రం తెల్లన్నం వండి చింతచిగురుపప్పో...లేక, పెంచుకున్న కోడిపెట్నో కోసి తృప్తిగా కొసరికొసరి మరీ అడిగి వడ్డించేది. తనుమాత్రం అలవాటుగానే రాగిసంగటిలో చింతతొక్కు వేసుకుని తినేది. 'నువ్వు తెల్లన్నం తిన్నావా...?' అని అడిగితే మాత్రం... 'ఆ అన్నం నాకు సహించదురా. సంగటి రెండు పిడచలు తింటేనే నాకు తృప్తి...'అనేది.



